క్లుప్తంగా

న్యాయవాదులకు ఏఐపై తరగతులు

ఖమ్మం లీగల్: ఐఏఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) ఆధ్వర్యాన శనివారం ఉదయం 10 గంటలకు గట్టయ్య సెంటర్‌లోని డీపీఆర్‌సీ బిల్డింగ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్‌పై తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఈ తరగతులను వరంగల్ సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి, బెక్కం భగత్‌సేన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పరామర్శ

ఖమ్మం వన్‌టౌన్: నగరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పాదిల పాపారావు భార్య పార్వతి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈమేరకు పార్వతి చిత్రపటం వద్ద నివాలులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, ఉమ్మినేని కృష్ణ, షేక్ ఇమామ్, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మందడపు నాగేశ్వరరావు, తాళ్లూరి రాము, విప్లవ్, ప్రసాద్, ఉపేందర్, సమీరా పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఉదయ్‌శంకర్

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడులో హైదరాబాద్‌కు చెందిన కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యాన బుధవారం రైతులకు వరిలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ్‌శంకర్ వ్యవసాయరంగంలో మిత్ర పురుగులు, విత్తన శుద్ధిపై వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. వెదజల్లే పద్ధతి, ఆవశ్యకత, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, పురుగు మందుల వాడకం, వాడిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమానగేష్, ఏఈఓ ఆదర్శ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అధికారులు

కామేపల్లి: మండల పరిధి పింజరమడుగు, గోవింద్రాల గ్రామంలోని ఎత్తిపోతల పథకానికి మరమ్మతుల చేయుటకు డీఈఈ శంకర్, జగన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మరమ్మతుల విషయమై ఇటీవల స్థానిక రైతులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా.. సమస్య పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులకు ఆయన సూచించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈమేరకు మరమ్మతుల విలువ అంచనాలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ రమేశ్, ఇల్లెందు ఏఎంసీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, సొసైటీ డైరెక్టర్ లక్ష్మీకిషన్, మాజీ సర్పంచ్ బానోత్ రవి, ఆలోత్ ప్రేమ్‌కుమార్, హట్కర్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా మట్టి డంప్ చేస్తున్న వారికి కేఎంసీ అధికారులు బుధవారం జరిమానా విధించారు. ట్రాక్టర్ల ట్రక్కులకు వెనుక డోర్ పెట్టకుండానే మట్టి తోలడంతో రోడ్ల వెంట మట్టి కుప్పలు పడడం గమనించిన కేఎంసీ అధికారులు, సిబ్బంది వాటిని అడ్డుకున్నారు. మట్టిని ఎక్కడకు తరలిస్తున్నారని ఆరా తీశారు. రోడ్ల వెంట మట్టి పోతున్నా పట్టించుకోకుండా, అనుతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో మట్టి కుప్పలు పోయడం పట్ల ట్రాక్టర్ యజమానులకు అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా రూ.2 వేల జరిమానా విధించారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	24		20
బెండకాయ	48	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	48	చుక్కకూర	3
బోడ కాకర	110		20
బీర	58	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	38		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		40
చామగడ్డ	54	పుదీన	1
క్యారెట్	36		25
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

నిబంధనలకు పాతర..



పల్లెగూడెం ఏరియాలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ

యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ

- ధనార్జనే ధ్యేయంగా నిర్వాహకుల తీరు
- అక్రమంగా కలప, మట్టి తరలింపు
- పర్యావరణానికి ముప్పు తప్పదంటున్న నిపుణులు
- పట్టించుకోని మైనింగ్, పంచాయతీల కార్యదర్శులు

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ వీటిని ఏర్పాటు చేస్తున్నా.. సంబంధిత అధికారులు తమకు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రతి ఏటా నిర్వాహకులు తమ ఇష్టానుసారం బట్టీలు ఏర్పాటు చేసి కలపతో కాల్చడం, సీజన్ ముగియగానే వెళ్లిపోవడంతో వాటి నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళితో సమీప గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు అనారోగ్యాల పాలవుతున్నారు.

రోడ్ల వెంటే..

నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండలంలో పల్లెగూడెం, ఎంవెంకటాయపాలెం, పోలేపల్లి, గొల్లగూడెం, కామంచికల్, తిరుమలాయపాలెం మండలంలో బచ్చోడు, కాకరవాయిలలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయినా సంబంధిత మైనింగ్, పంచాయతీరాజ్, రెవెన్యూ అటవీ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పల్లెగూడెం, ఎంవెంకటాయపాలెం గ్రామాల్లో ఖమ్మం-మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కనే వీటిని నిర్వహిస్తుండడంతో వాటి నుంచి వచ్చే దుమ్ము, ధూళితో పలు వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి.

పట్టింపు కరువు..

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బట్టీల నిర్వహణ యథేచ్ఛగా చేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు తమ కళ్లెదుటే అక్రమ బట్టీలు వెలిసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాటి నుంచి వచ్చే కాలుష్యంతో స్థానికంగా ఉండే వారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం గ్రామాల్లో నిత్యం సందర్శించే పంచాయతీ కార్యదర్శులు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడంలో ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. అదే విధంగా అనుమతులు లేకుండా భారీ వృక్షాలను నరికి బట్టీలకు తరలిస్తుంటే అటవీశాఖ అధికారులు సైతం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పాటించాల్సిన నియమాలు..

- ఇటుక బట్టీ ఏర్పాటు కోసం ముందుగా గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి బట్టీ ఏర్పాటుతో ఎలాంటి ఇబ్బంది లేదని ఎన్ఓసీ తీసుకోవాలి.
- బట్టీలను కాల్చడానికి కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి అనుమతి తప్పనిసరి.
- కలపను తరలించడానికి అటవీశాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి.
- ప్రధాన రహదారులకు దూరంగా, గ్రామాలకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వీటిని నిర్వహించాలి.
- బట్టీలో విద్యుత్ వాడకానికి విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతి పొందాలి.
- చెరువుల నుంచి మట్టిని తరలించేందుకు ముందుగానే ఇరిగేషన్, మైనింగ్ అధికారుల పర్మిషన్ కావాలి.
- బట్టీ ఏర్పాటు చేసే ప్రాంతాల్లో నాలా కన్వర్షన్ ఉండాలి.

అనుమతులు తప్పనిసరి..

ఇటుక బట్టీలు నిర్వహించే వారు తప్పనిసరిగా ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శుల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందే. ప్రజలకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాలకు దూర ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలి. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవు.

– కుమార్, ఎంపీడీఓ

25 నుంచి శివరాత్రి ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో స్వామివారి ఆలయం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న స్వయంభు శ్రీ భ్రమరాంభ సమేత గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. 25న ఉదయం 5:30 గంటలకు సుప్రభాత సేవ, మంగళ వాయిద్యాలతో ఉత్సవాలను ప్రారంభమై అభిషేకం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న మహాశివరాత్రి సందర్భంగా లఘుభిషేకాలు నిర్వహించి, స్వామి వారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను తోడుకొని వచ్చి రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం జరిపిస్తారు. 27న స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం అనంతరం గ్రామోత్సవం(ఊరేగింపు) వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దమ్మతల్లి ఆలయంలో వార్షిక పూజలు

ఖమ్మం గాంధీచౌక్: ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డులోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అలుపెరగని పోరాట యోధుడు ఛత్రపతి

అలుపెరగని పోరాటయోధుడు ఛత్రపతి శివాజీ అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం శివాజీ జయంతి వేడుకలను బీజేపీ, వివిధ సంఘాల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ధైర్యానికి, దేశ భక్తికి, దైవ భక్తికి మారుపేరుగానే కాక సనాతన ధర్మ పరిరక్షకుడిగా నిలిచిన ఆయన స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని ర్యాలీ, శోభాయాత్రల్లో నినదించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: వన్‌టౌన్‌లో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



నేలకొండపల్లిలో బీజేపీ నాయకుల నివాళి



కామేపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఖమ్మంగాంధీచౌక్: శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూవాహిని కార్యకర్తలు



ఖమ్మంరూరల్: వరంగల్ క్రాస్‌రోడ్‌లో ర్యాలీ..



ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్ద..

పాలు, పండ్లు పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం, మంత్రి పొంగులేటి, ఎంపీ క్యాంపు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ అభిమానులు ప్రభుత్వాస్పత్రి, పెద్దతండా, కరుణగిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలో కార్పొరేటర్ రఫీదా ముస్తఫా ఆధ్వర్యాన పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, తుంబూరు దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం పెదతండాలో ఉన్న మెఫీ మానసిక దివ్యాంగుల కేంద్రంలో తుంబూరు దయాకర్‌రెడి కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నేలకొండపల్లిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య పుట్టినరోజు సందర్భంగా మానసిక దివ్యాంగుల కేంద్రం, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, ఉదయ్, ఆదాం, వెంకటేశ్వర్లు, నాగుబండి శ్రీనివాసరావు, మరికంటి ధనలక్ష్మి, పాల్గొన్నారు.

22న వేలంపాట..

ఖమ్మంఅర్బన్: రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని ఉర్దూషాదీఖానాలో ప్రతీ సంవత్సరం నిర్వహించే తరహాలో హలీం, హరీష్ దుకాణాలు నడుపుకోవడానికి ఈనెల 22 సాయంత్రం 4 గంటలకు తహసీల్‌లో వేలంపాట నిర్వహిచనున్నట్లు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు మధ్యాహ్నం 3 గంటల కల్లా రూ.5 వేలు దరావత్ చెల్లించాలని, వేలం పాట అయ్యాక పైకం చెల్లించవచ్చన్నారు.

23న నెల నెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల 91వ అభ్యుదయ సాంస్కృతిక కదంబం ఈ నెల 23 ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(అర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్ రావు, ఎ.సుబ్రమణ్యకుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం కళాపరిషత్, ప్రజా నాట్యమండలి సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో పీటీ మాధవ్ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించిన జనరల్ బోగీలు నాటికను శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు కళాబృందం ప్రదర్శించనుండగా.. జనాపద నృత్య ప్రదర్శనలు, భరత నాట్యం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం గణిత శాస్త్రం, అర్థశాస్త్ర విభాగాల్లోని పలు అంశాలపై ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు నర్సింహారావు, లక్ష్మణ్‌రావులు ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి..



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ నెల 28లోపు కనీసం 85 శాతం వసూళ్లు చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) రాంబాబు గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు వసూళ్లయిన పన్నుల పైకాన్ని వెంటనే ట్రెజరీలో జమ చేయాలని, ఇటీవల విడుదలైన మల్టీపర్పస్ వర్కర్ల జీతాలను చెల్లించాలని, ఉపాధి హామీ పథకంలోని మెటీరియల్‌కు విడుదలైన నిధులను సంబంధిత ఏజెన్సీకి చెల్లించాలని సూచించారు. ప్రతీ జీపీల్లో నర్సరీల నిర్వహణపై దృష్టి సారించి వారం లోపల సీడింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, సేంద్రీయ ఎరువు తయారి, పొడి చెత్త రీసైక్లింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. జీపీలో నిర్వహిస్తున్న సంతలు, షాపులు, ఇతర వేలంలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని, ప్రతీ పనికి రికార్డులు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, సింగరేణి మండల ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలి



పన్ను రశీదు అందిస్తున్న కార్పొరేటర్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు ఆస్తి, పంపు పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని 51వ డివిజన్ కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం పిలుపునిచ్చారు. బుధవారం 51వ డివిజన్‌లోని హనుమంతుడి గుడి సెంటర్‌లో పన్నుల వసూలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పన్నులు చెల్లించేందుకు నెట్ సెంటర్లు, కార్యాలయానికి వెళ్లకుండా డివిజన్‌లోనే స్థానికులకు అందుబాటులో పన్నుల వసూలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ జి.శ్రీనివాస్, ఆర్ఐ జ్యోతి, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించండి



మాట్లాడుతున్న అదనపు సీపీ ప్రసాద్‌రావు

కామేపల్లి: పోలీసులు ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీగా పని చేయాలని లాండ్ అండ్ ఆర్డర్ అదనపు సీపీ ప్రసాద్‌రావు సూచించారు.బుధవారం కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యాన సబ్ డివిజన్ పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటి కేసులు అప్పడే పరిష్కరిస్తూ ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించాలన్నారు. నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ నిర్వహించాలని, అక్రమ రవాణా, వ్యాపారాలపై నిఘా పటిష్టం చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని, మహిళలకు రక్షణగా ఉండాలని తెలిపారు. అన్యాయం జరిగితే ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, దురుద్దేశంతో ఫిర్యాదు చేస్తే చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి, మురళీ, సంజీవ్, ఎస్సైలు సాయికుమార్, జగదీశ్, సంతోశ్, రాజారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం'

నేలకొండపల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ.. ప్రజా సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్నారని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, రచ్చా నరసింహారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, పగిడికత్తుల నాగేశ్వరరావు, బలుసు ప్రమీల, సూర్యానారాయణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

చెరకు టన్నుకు రూ. 500 బోనస్‌పై చర్చ..



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం, ఫ్యాక్టరీ యాజమాన్యం

నేలకొండపల్లి: ధాన్యం రైతులకు ఇచ్చిన తరహాలోనే చెరకు రైతులకు టన్నుకు రూ.500 బోనస్ ఇవ్వాలనే విషయంపై పాలకవర్గం-ఫ్యాక్టరీ యాజమాన్యం చర్చించారు. మండలంలోని మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్‌లో బుధవారం నూతనంగా నియమించిన చెరకు అభివృద్ధి మండలి (సీడీసీ) పాలకవర్గాన్ని ఫ్యాక్టరీ ఎం.డీ. నామా కృష్ణయ్య ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. అనంతరం చెరకు రైతులకు బోనస్ చెల్లిస్తే చెరుకు సాగు మరింత విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నట్లు చర్చించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కేన్ కమిషనర్ రవీందర్‌రావు, సీడీసీ చైర్మన్ వై.సూర్యానారాయణరెడ్డి, ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, డీజీఎం అప్పారావు, సీడీసీ డైరెక్టర్లు మధు, కృష్ణారావు, మాజీ సీడీసీ చైర్మన్ యాసా విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక మురుగు పనైనట్టే..



పైపులైన్ వేసేందుకు తవ్వకాలు



సిద్ధంగా ఉన్న పైపులు

- రూ.249 కోట్ల అంచనాలతో పైపులైన్ నిర్మాణ పనులు
- 19 డివిజన్లలో కొనసాగుతున్న వైనం
- ప్రతీ డివిజన్‌కు అనుసంధానించేలా ప్రణాళికలు
- వచ్చే వానాకాలం కల్లా పూర్తయ్యేలా కార్యాచరణ

ఖమ్మంఅర్బన్: నగరంలో మురుగు నీటి సమస్యల తొలగించేందుకు అమృత పథకం కింద మంజూరైన నిధులతో అండర్ పైపులైన్ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 20 డివిజన్ల పరిధిలో పైపులైన్ల ద్వారా 9 కిలో మీటర్ల మేర మురుగు నీరు తరలించేందుకు 6వ డివిజన్ ప్రశాంతినగర్‌లో పనులు మొదలయ్యాయి. 1వ డివిజన్ నుంచి(8వ డివిజన్ మినహా) 20వ డివిజన్ వరకు పైపులైన్లను లింక్‌చేసి ధంసలాపురం వద్ద మున్నేరులో కలిసేలా చర్యలు చేపట్టారు.

రూ.249 కోట్ల అంచనాలతో..

పైపు లైన్ల నిర్మాణం కోసం అమృత పథకం కింద సుమారు రూ.249 కోట్ల అంచనాలతో నిధులు మంజూరయ్యాయి. కాలనీల్లో విడుదలయ్యే మురుగు, వానాకాలంలో వచ్చే నీటిని బట్టి పైపులైన్ల సైజును పెంచుకుంటూ ఆయా డివిజన్లలో పనులు చేస్తున్నారు. ఈమేరకు ఖానాపురం అలుగు వాగును అభివృద్ధి చేయనున్నారు. పైపులైన్ పనులు అయ్యాక అలుగు వాగు పనులు చేపట్టనున్నారు.

వచ్చే వానాకాలం కల్లా..

వచ్చే వానాకాలం కల్లా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇటీవల మున్సిపల్ ఇంజనీర్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శంకుస్థాపన పేరుతో పనులు ఆపొద్దని మంత్రి ఆదేశించడంతో పనులను వేగవంతం చేశారు. కాగా, ఈ పైపులైన్‌తో పాటు మురుగు నీటిని శుద్ధి చేసే కేంద్రాలను గొల్లగూడెం, ధంసలాపురం వద్ద నిర్మాణం చేసేందుకు ప్రభుత్వ స్థల సేకరణ కోసం ఎదురు చూస్తున్నారు. స్థలం కేటాయింపులు కాగానే అక్కడ నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, పైపులైన్ కోసం చేపడుతున్న తవ్వకాలతో అనేక రహదార్లు, మురుగు నీరు పారే డ్రెయిన్లు ధ్వంసం అవుతున్నాయి.